తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
# జనంసాక్షి
www.janamsakshi.org
హైదరాబాద్ - రంగారెడ్డి
మేడ్చల్ మల్కాజిగిరి వికారాబాద్
గురువారం 17 సెప్టెంబర్ 2026 | పేజీలు : 08




# కార్మికుల హక్కులపై నిర్బంధం ఆపాలి

**హక్కులను హరిస్తే ఉద్యమం ఉధృతం చేస్తాం: - ఎర్ర అశోక్**

### కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ధర్నా

మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 16 (జనంసాక్షి)
కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజాస్వామ్యబద్ధంగా ఆందోళనలు నిర్వహించే హక్కును రాష్ట్ర ప్రభుత్వం కాలరాస్తోందని సీఐటీయూ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎర్ర అశోక్ విమర్శించారు. కార్మికులపై నిర్బంధాన్ని నిలిపివేసి, ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ సీఐటీయూ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు.
జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ధర్నాను ఎర్ర అశోక్ ప్రారంభించి మాట్లాడారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కార్మిక వర్గానికి పలు హామీలు ఇచ్చి, వాటిని ఎన్నికల మేనిఫెస్టోలో పొందుపరిచిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చి సుమారు 1,000 రోజులు గడిచినా కార్మికులకు ఇచ్చిన హామీల అమలుపై నిర్లక్ష్యం వహిస్తోందని ఆరోపించారు. సమస్యల పరిష్కారం కోసం కార్మికులు ఆందోళనలు చేపడితే, హైదరాబాద్‌తో పాటు జిల్లాల్లో ముందస్తు అరెస్టులు, నిర్బంధ చర్యలకు పాల్పడటం అప్రజాస్వామికమన్నారు.
కార్మిక సంఘాల కార్యక్రమాలకు అనుమతులు నిరాకరించడం, నాయకులను అరెస్టు చేయడం ద్వారా కార్మికుల రాజ్యాంగ హక్కులను హరిస్తున్నారని ఎర్ర అశోక్ అన్నారు. సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాల్సిన ప్రభుత్వం ఆందోళన చేస్తున్న కార్మికులపై నిర్బంధాన్ని ప్రయోగించడం సరికాదన్నారు. కార్మికుల డిమాండ్ల పరిష్కారం కోసం ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. జిల్లా ఉపాధ్యక్షుడు ఎన్.శ్రీనివాస్ మాట్లాడుతూ.. సెప్టెంబరు 8, 9 తేదీల్లో అంగన్‌వాడీ, ఆశా సంఘాలు ఇచ్చిన 'చలో హైదరాబాద్' పిలుపును అడ్డుకునేందుకు ప్రభుత్వం ముందస్తు అరెస్టులకు పాల్పడిందని ఆరోపించారు. పలువురు నాయకులను ఇళ్ల వద్దే అదుపులోకి తీసుకున్నారని, సీఐటీయూ రాష్ట్ర నాయకులపై కూడా నిర్బంధ చర్యలు చేపట్టారని అన్నారు. ఆశా వర్కర్లకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని, గ్రామ పంచాయతీ, మున్సిపల్, ఆర్టీసీ, విద్యుత్, ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్, బిల్డింగ్, హమాలీ కార్మికుల కోసం సంక్షేమ బోర్డులు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మేడ్చల్--మల్కాజిగిరి జిల్లాలో మున్సిపల్ కార్మికుల వేతనాల నుంచి కట్ చేసిన పీఎఫ్ మొత్తాన్ని వెంటనే వారి ఖాతాల్లో జమ చేయాలని కోరారు.
కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి కే.ఉన్నికృష్ణ, షామీర్‌పేట మండల కార్యదర్శి ఎం.కిష్టప్ప, మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు ప్రశాంత్, రమేష్, కలమ్మ, సుగుణ, నరసింహ, ఆరోగ్యం తదితరులు పాల్గొన్నారు.




## కార్మికుల అక్రమ నిర్బంధాన్ని ఆపాలి

- ముందస్తు అరెస్టుల పేరుతో వేధింపులు సరికాదు
- ఇందిరాపార్క్ ధర్నా చౌక్‌లో కార్మిక సంఘాల నిరసన
- కార్మికుల హక్కులను పరిరక్షించాలి: పాలడుగు భాస్కర్
- హామీలు అమలు చేయకపోతే ఐక్య ఉద్యమం: రాంబాబు యాదవ్



## ప్రభుత్వ పాఠశాలల్లో డీఈఓ ఆకస్మిక తనిఖీ

- ఎఫ్ఎల్ఎన్ నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి
- విద్యార్థులతో నేరుగా మాట్లాడి అభ్యసన స్థాయిపై ఆరా
- డిజిటల్ బోధన, కంప్యూటర్ గదుల పరిశీలన
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ: డీఈఓ వెంకటేశ్వర్లు

లోపలి పేజీలో

## 22ఏ పేరుతో సామాన్యులను వేధించొద్దు

- పేదల భూములకు రక్షణ కల్పించాలి: టీడీపీ
- కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పణ
- భూకబ్జాదారులపై చర్యలకు మద్దతు
- చేవెళ్ల పార్లమెంట్ కన్వీనర్ కట్టా వెంకటేష్ గౌడ్



## టెట్ విధానంపై సబ్‌కమిటీ ఏర్పాటు

- సిలబస్, అర్హత మార్కులు, పరీక్షా విధానంపై సమీక్ష
- 2028లోగా టెట్ ఉత్తీర్ణతపై ఉపాధ్యాయుల ఆందోళన
- అర్హత మార్కులు తగ్గించాలని ఎస్‌టీఎఫ్ఐ వినతి
- ఎన్నికల సంఘానికి పలు డిమాండ్లతో వినతిపత్రం

**ముషీరాబాద్, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) సిలబస్, అర్హత మార్కులు, పరీక్షా విధానాన్ని సమీక్షించి మార్పులు సూచించేందుకు సబ్‌కమిటీ ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు ఎన్‌సీటీఈ చైర్మన్ ప్రొఫెసర్ పంకజ్ అరోరా తెలిపారు. బుధవారం స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్‌టీఎఫ్ఐ) అధ్యక్షుడు సి.ఎన్. భార్తి నేతృత్వంలోని ప్రతినిధి బృందం ఢిల్లీలో మిగితా 2లో

# రూ.5.11 కోట్లతో యూజీడీ, స్టార్మ్ వాటర్ డ్రైనేజీ పనులకు నిధులు

**నాగారం అభివృద్ధికి వజ్రేష్ యాదవ్ కృషి**



**కీసర, సెప్టెంబరు 16 (జనంసాక్షి) :**
నాగారం డివిజన్ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తోందని మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ అన్నారు. డివిజన్‌లో మౌలిక వసతుల అభివృద్ధికి రూ.5.11 కోట్ల నిధులు మంజూరు కావడం ప్రజలకు ఎంతో ప్రయోజనకరమని తెలిపారు. బుధవారం నాగారంలో అభివృద్ధి పనులకు సంబంధించిన కార్యక్ర మంలో ఆయన పాల్గొన్నారు. యూజీడీ పనులకు రూ.2,86,67, 356, స్టార్మ్‌వాటర్ డ్రైనేజీ పనులకు రూ.2,24,99,612 కేటాయించినట్లు చెప్పారు.
ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. నాగారం డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంద న్నారు. మంజూరైన నిధులతో డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపడటంతో పాటు వర్షాకాలంలో నీటి నిల్వ సమస్యలకు పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. పనులను నాణ్యతా ప్రమాణాలతో సకాలంలో పూర్తి చేయించేలా అధికారులతో సమన్వయం చేస్తామని తెలిపారు. ప్రజల అవసరాలకు అనుగుణంగా నాగారంలో మరిన్ని అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తామని అన్నారు. నిధులు మంజూరు చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. యువ నాయకుడు కౌకుట్ల జీవన్‌రెడ్డి మాట్లాడుతూ.. రూ.5.11 కోట్ల నిధుల మంజూరు నాగారం అభివృద్ధిలో కీలక ముందడుగన్నారు. యూజీడీ, స్టార్మ్‌వాటర్ డ్రైనేజీ పనులతో ప్రజల చిరకాల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని చెప్పారు. అభివృద్ధి పనులు సకాలంలో పూర్తయ్యేలా అధికారులతో సమన్వయం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాగారం డివిజన్ అధ్యక్షుడు భూమయ్య యాదవ్, మాజీ కౌన్సిలర్ పంగ హరిబాబు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీ వాసులు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా వెంకటేష్ గౌడ్

### ఎంఎంసీ 9వ డివిజన్ మేడిపల్లి--పర్వతాపూర్ నుంచి అవకాశం



**బోడుప్పల్--సెప్టెంబర్ 16 జనంసాక్షి:**మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ కమిటీలో ఎంఎంసీ 9వ డివిజన్ మేడిపల్లి--పర్వతాపూర్‌కు చెందిన వెంకటేష్ గౌడ్‌ను కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధిగా (స్పోక్స్‌పర్సన్) ఎంపిక చేశారు. ఈ మేరకు డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ నిర్ణయం తీసుకున్నారు.తనపై నమ్మకం ఉంచి కీలక బాధ్యతలు అప్పగించిన డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, 9వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, మాజీ మేయర్ అమర్‌సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్‌లకు వెంకటేష్ గౌడ్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.వెంకటేష్ గౌడ్ నియామకంపై కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేస్తూ శుభాకాంక్షలు తెలిపారు.

# అక్రమ నిర్మాణాన్ని కూల్చివేసిన దుండిగల్ అధికారులు



**నిజాంపేట్ సెప్టెంబర్ 16 జనం సాక్షి::**కుతుబుల్లాపూర్ నియోజక వర్గందుండిగల్ 59 సర్కిల్ దొమ్మర పోచంపల్లి లోని అక్రమ నిర్మాణం పై సర్కిల్ అధికారుల చర్యలు చేపట్టి అక్రమ భవన నిర్మాణాన్ని కొంతమేర కూల్చి వేశారు.దుండిగల్ సర్కిల్ పరిధిలోని దొమ్మర పోచంపల్లి ప్లాట్ నెం. 22, సర్వేనెంబర్. 224/ ఈ లో ఎస్ ం2 పర్మిషన్ తీసుకొని ఎస్ ం4 అనధికార అంతస్తులను నిర్మించడంతో డిప్యూటీ కమిషనర్ ఆదేశాలతో బుధవారం అధికారులు కూల్చివేతలూ చేపట్టినారు ఈ సందర్భంగా దుండిగల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ డాక్టర్ ఎస్. వెంకట మణి కరణ్ మాట్లాడుతూ నిబంధనలకు విరుద్ధంగా నిర్మించే ఏ నిర్మాణాన్ని కూడా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. తమ సిబ్బందినిఘా తీవ్రతరం చేసి దుండిగల్ సర్కిల్ పరిధిలో తక్కువ గజాలలో అనుమతులు లేకుండా చేపడుతున్న నిర్మాణాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశామని తెలిపారు.నిబంధనల ఉల్లంఘనకు చెక్ అనుమతులు ఒకలా తీసుకొని, అదనంగా అనధికారిక నిర్మాణాలు చేపడుతున్న వారిని గుర్తిస్తున్నట్లు తెలిపారు.భారీ కూల్చివేతలు ఖాయం అని ఇలాంటి అనధికార నిర్మాణాలను ఎప్పటికప్పుడు గుర్తించి, కఠిన చర్యలు తీసుకుంటూ కూల్చివేతలు కొనసాగిస్తామని డిప్యూటీ కమిషనర్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ సిటీ ప్లానర్ శ్రీనివాస్, మరియు టౌన్ ప్లానింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# శంషాబాద్‌లో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు




**శంషాబాద్, సెప్టెంబర్16(జనంసాక్షి)**శంషాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో సీపీఐ ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలు నిర్వహించారు.మండల కార్యదర్శి నర్ర గిరి ఆధ్వర్యంలో అమరవీరులకు నివాళులు అర్పించి, జిల్లా కార్యవర్గ సభ్యుడు రాచమల్ల యాదగిరి సీపీఐ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు గిలకరాజు, శ్రీనివాస్, దండి రవికుమార్, నరేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా బండారు రవీందర్ నియామకం

### నియామక పత్రం అందజేసిన డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్



**బోడుప్పల్-సెప్టెంబర్ 16 జనంసాక్షి::**మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా బండారు రవీందర్‌ను నియమిస్తూ పార్టీ అధిష్ఠానం నిర్ణయం తీసుకుంది.ఈ మేరకు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ చేతుల మీదుగా బండారు రవీందర్ నియామక పత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు బండారు రవీందర్‌కు అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో మరింత విస్తృతంగా నిర్వహించేందుకు కొత్త బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని నాయకులు ఆకాంక్షించారు.జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయంతో ముందుకు సాగడం, ప్రజా సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు.తనపై నమ్మకం ఉంచి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ మార్గదర్శకత్వంలో పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తూ, కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బండారు రవీందర్‌కు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు శుభాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ,ప్రజలతో మరింత సన్నిహితంగా ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ అమర్ సింగ్,డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్,మాజీ కార్పొరేటర్లు నాయకులు పాల్గొన్నారు.

# పీర్జాదిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా పప్పుల అంజిరెడ్డి నియామకం

### నియామక పత్రం అందజేసిన డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్



**బోడుప్పల్-సెప్టెంబర్ 16 జనంసాక్షి:**పీర్జాదిగూడ డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రదాన కార్యదర్శిగా పప్పుల అంజిరెడ్డి నియమితులయ్యారు.బుధవారం డీసిసి అద్యక్షులు తోటకూర వజ్రేష్ యాదవ్ చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు.ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు, పార్టీ కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో మరింత విస్తృతంగా నిర్వహించేందుకు కొత్త బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని నాయకులు ఆకాంక్షించారు.జిల్లాలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేయడం, పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమన్వయంతో ముందుకు సాగడం, ప్రజా సమస్యలను పార్టీ దృష్టికి తీసుకెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేయడం వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు.తనపై నమ్మకం ఉంచి జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యదర్శిగా బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ మార్గదర్శకత్వంలో పార్టీ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహిస్తూ, కాంగ్రెస్ పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.నూతనంగా బాధ్యతలు స్వీకరించిన బండారు రవీందర్‌కు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు శు భాకాంక్షలు తెలిపారు. రానున్న రోజుల్లో పార్టీ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటూ,ప్రజలతో మరింత సన్నిహితంగా ఉంటూ పార్టీ అభివృద్ధికి కృషి చేయాలని వారు ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షులు బండి శ్రీరాములు,మాజీ మేయర్ అమర్ సింగ్,డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్,మాజీ కార్పొరేటర్లు నాయకులు పాల్గొన్నారు.

# తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట

### వారోత్సవాలను జయప్రదం చేయాలి




**హయత్ నగర్, సెప్టెంబర్ 16 (జనం సాక్షి)**తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా ఇబ్రహీంపట్నంలో నిర్వహించనున్న బహిరంగ సభలను జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం చింతలకుంటలోని వీరనారి సాకలి ఐలమ్మ విగ్రహం నుంచి ఎల్బీనగర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఎల్బీనగర్ సర్కిల్ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య అధ్యక్షతన జరిగిన ఈ ర్యాలీలో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలేటి ఎల్లయ్య మాట్లాడుతూ దున్నేవాడికే భూమి, వెట్టిచాకిరి నిర్మూలన, దోపిడీకి వ్యతిరేకంగా పుచ్చలపల్లి సుందరయ్య, సాకలి ఐలమ్మ, మల్లు స్వరాజ్యం, భీమ్‌రెడ్డి నరసింహారెడ్డి తదితరులు సాగించిన పోరాటాలను స్మరించుకోవాలని అన్నారు. సెప్టెంబర్ 10 నుంచి 17 వరకు నిర్వహిస్తున్న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. సీపీఎం రంగారెడ్డి జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం. చంద్రమోహన్ మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, పేద ప్రజల విముక్తి కోసం తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం సాగిందన్నారు. భూస్వాముల దోపిడీ, దౌర్జన్యాలు, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా కమ్యూనిస్టుల నాయకత్వంలో పోరాటం జరిగిందని తెలిపారు. ఆ పోరాట చరిత్రను ఆర్ఎస్ఎస్, బీజేపీ వక్రీకరిస్తున్నాయని ఆరోపించారు.పోరాటాల ఫలితంగా పేద ప్రజలకు సుమారు 10 లక్షల ఎకరాల భూమి పంపిణీ జరిగిన చరిత్ర ఉందని చంద్రమోహన్ తెలిపారు. నాటి పోరాటంలో అమరులైన నాయకులు, కార్యకర్తల త్యాగాలను స్మరించుకుంటూ నేటి తరానికి ఆ పోరాట స్ఫూర్తిని అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సరూర్‌నగర్ సర్కిల్ కార్యదర్శి సీహెచ్. వెంకన్న, హయత్‌నగర్ సర్కిల్ కమిటీ సభ్యుడు చింతపల్లి కృష్ణయ్య, ఎల్బీనగర్ సర్కిల్ కమిటీ సభ్యులు భూష రాజు, కాశయ్య, దండు రాధా, సుమన్ నాయక్, చిట్టిమల్ల సైదులు, మల్లెపాక వీరయ్య, తడబోయిన కృష్ణమూర్తి, గోపీనాయక్, పాండు, కదారి రాములు నాయక్, రేణుక, సైదమ్మ, మొగిలి అలివేలు, మన్యం రాధమ్మ, దండు అంజమ్మ తదితరులు పాల్గొన్నారు.

# ఉత్తమ ఉపాధ్యాయునికి ఘన సన్మానం



**యాచారం,సెప్టెంబర్ 16 (జనం సాక్షి ):** నంది వనపర్తి లోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, పి.డి. శ్రీనివాస్‌ను జ్యోతి ఎడ్యుకేటెడ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. అనంతరం మండల స్థాయి క్రీడా పోటీలలో అండర్-17, అండర్-14 వాలీబాల్ మరియు అండర్-14 కబడ్డీ విభాగాల్లో ప్రథమ బహుమతులు సాధించిన పాఠశాల విద్యార్థులను అసోసియేషన్ సభ్యులు ప్రత్యేకంగా అభినందించారు. విజేతలకు నోట్‌బుక్స్, పెన్నులను బహుమతులుగా అందజేశారు. గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తెచ్చిన ఉపాధ్యాయుడికి, విద్యార్థులకు అసోసియేషన్ ప్రతినిధులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. యువత, విద్య, క్రీడల అభివృద్ధికి తమ వంతు ప్రోత్సాహం ఎల్లప్పుడూ ఉంటుందని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# వార్డు సభ్యుల సమస్యలు పరిష్కరించాలి

## ఎంపీడీవోకు వినతిపత్రం అందజేత



**యాచారం సెప్టెంబర్16(జనంసాక్షి** ::గ్రామ పంచాయతీల్లో ప్రజాప్రతినిధులుగా ఎన్నుకోబడిన వార్డు మెంబర్ల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ యాచారం మండల ఎంపీడీవో గారికి వినతిపత్రం అందజేసినట్లు వార్డు మెంబర్ల ఫోరమ్ మండల అధ్యక్షుడు తలారి సత్యనారాయణ తెలిపారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... గ్రామ కార్యదర్శులు వార్డు సభ్యులను చులకనగా చూస్తూ, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఊరుకునే ప్రసక్తి లేదని హెచ్చరించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధి వివరాలు, నిధుల ఖర్చుల లెక్కలను అడిగే సంపూర్ణ చట్టబద్ధమైన హక్కు వార్డు మెంబర్లకు ఉందని స్పష్టం చేశారు.ప్రజాస్వామ్యబద్ధంగా ఓట్లతో గెలిచిన వార్డు మెంబర్లకు పంచాయతీ అభివృద్ధి పనులు, నిధుల లెక్కలు అడిగే పూర్తి హక్కు ఉంది. లెక్కలు అడిగితే "మీకు అర్హత లేదు" అని గ్రామ కార్యదర్శులు బెదిరించడం అహంకారపూరిత చర్య. ఇటువంటి వైఖరిని వెంటనే మానుకోవాలి. గ్రామ పంచాయతీ పరిపాలన పారదర్శకంగా ఉండాలి. ప్రజాధనం ఖర్చు వివరాలను ప్రజాప్రతినిధులకు అందుబాటులో ఉంచాల్సిన బాధ్యత అధికారులపై ఉంది.గ్రామ కార్యదర్శులు తమ తీరు మార్చుకోకపోతే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పెద్ద ఎత్తున ఆందోళన బాట పడతామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్లు వి. మహేష్, సంజీవరెడ్డి, రామకృష్ణ, పోలే శివ, కంబాలపల్లి కుమార్, కొండ్రెడ్డి రాజు, వినోద్, విప్లవ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రేమ్ కుమార్ శర్మ మృతి పట్ల పైలెట్ రోహిత్ రెడ్డి నివాళులు

## కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే



**తాండూరు సెప్టెంబర్ 16(జనంసాక్షి)**తాండూరు పట్టణంలోని టిపిహెచ్ ఎస్ స్కూల్ కరస్పాండెంట్ కీర్తి శర్మ భర్త, ప్రముఖ వ్యాపారవేత్త ప్రేమ్ కుమార్ శర్మ (పప్పీ సేట్) అకాల మృతి చెందడం పట్ల మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా బుధవారం తాండూరు పట్టణంలోని వారి నివాసానికి వెళ్లి ప్రేమ్ కుమార్ శర్మ పార్థివదేహాన్ని సందర్శించి పైలెట్ రోహిత్ రెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రేమ్ కుమార్ శర్మ తాండూరు పట్టణంలో ఎంతో పేరున్న వ్యక్తి. ఆయన మృతి చెందడం చాలా బాధాకరం. ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుని ప్రార్థిస్తున్నానని అన్నారు.కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు. వారి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ తాండూరు నియోజకవర్గ ఇన్‌చార్జ్ శ్రీశైల రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రాజు గౌడ్, మాజీ జడ్పీటీసీ ప్రమోదిని, సీనియర్ నాయకులు శ్రీనివాస్ చారి, వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నిమజ్జనానికి ఆటంకం లేకుండా ఏర్పాట్లు

## : చైర్మన్ జాము రవి



**శామీర్ పేట్, సెప్టెంబర్ 16(జనం సాక్షి )** మూడు చింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని అన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన వినాయక మండపాల అధ్యక్షులతో వినాయక నిమజ్జన కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. మున్సిపల్ చైర్మన్ జాము రవి అధ్యక్షతన, మున్ని పల్ కమిషనర్ వెంకట గోపాల్ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు.వినాయక నిమజ్జన కార్యక్రమానికి ఎలాంటి ఆటంకాలు కలగకుండా ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ జాము రవి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు ఉద్దమర్రి, కొల్తూర్, లక్ష్మాపూర్ ప్రాంతాల్లో నిమజ్జన ఏర్పాట్లను సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు.ఈ సందర్భంగా ఎమ్మార్వో గులాం ఇంద్రిస్, సీఐలు నరసింహారెడ్డి, గురువయ్య తదితర అధికారులతో కలిసి నిమజ్జన మార్గాలు, పరిసర ప్రాంతాలను పరిశీలించి, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయ్యాలని సూచించారు.ఈ సందర్భంగా వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా నిర్వహించేందుకు తీసు కోవాల్సిన భద్రతా చర్యలు, ట్రాఫిక్ నియంత్రణ, పారిశుద్ధ్య ఏర్పాట్లు తదితర అంశాలపై మండపాల అధ్యక్షులతో చర్చించారు. ఈ కార్య క్రమంలో షామీర్‌పేట్ స్టేషన్ హౌస్ ఆఫీసర్ నరసింహారెడ్డి, జీనోమ్ వ్యాలీ స్టేషన్ హౌస్ ఆఫీసర్ గురువయ్య, స్థానిక కౌన్సిలర్ లు ర్యాకల నీరజ్ గౌడ్, గిరిపల్లి రమేష్, మెరుపాటి గోవర్ధన్ రెడ్డి బొమ్మలపల్లి మల్లేష్ యాదవ్, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు దోసకాయల వెంకటేష్, నాయకులు శ్రీకాంత్ రెడ్డి, బసవ రెడ్డి, మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ అర్షద్ అహ్మద్, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రాజేశ్వర్ రెడ్డి, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ మోహన్ సింగ్, తదితర మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# మాదక ద్రవ్యాల నిర్మూలనపై పోలీసుల అవగాహన



**హయత్ నగర్, సెప్టెంబర్ 16 (జనం సాక్షి)**గణేశ్ సురక్ష సంకల్ప్--2026లో భాగంగా మల్కాజిగిరి పోలీస్ కమిషనర్ బదుగుల సుమతి, ఐపీఎస్ ఆధ్వర్యంలో చేపట్టిన "సహచరి" కార్యక్రమంలో భాగంగా వనస్థలిపురం పోలీసుల ఆధ్వర్యంలో యువతకు, కాలనీ వాసులకు మాదక ద్రవ్యాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.ప్రశాంత్ నగర్‌లోని శ్రీ కనకదుర్గ అమ్మవారి ఆలయం, ఫ్రెండ్స్ యూత్ గణనాథుడి వద్ద జరిగిన కార్యక్రమంలో డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలని పోలీసులు సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం వల్ల యువత భవిష్యత్తు, కుటుంబ జీవితం తీవ్రంగా ప్రభావితమయ్యే ప్రమాదం ఉందని వివరించారు. మాదక ద్రవ్యాల వినియోగం, విక్రయాలకు సంబంధించిన సమాచారం ఉంటే పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వనస్థలిపురం ఏసీపీ పల్లె కాశిరెడ్డి, ఈగల్ ఫోర్స్ డీఎస్పీ బిక్షపతి రావు, వనస్థలిపురం సీఐ రవిబాబు, ఎస్ఐ గౌతమ్, సహచరి కోఆర్డినేటర్లు మమత, సునీత, గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి, కాలనీ అధ్యక్షులు శ్రీ కరుణాకర్ రెడ్డి, కనకదుర్గ దేవాలయం చైర్మన్ సంరెడ్డి భుజంగ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# యువత స్వయం ఉపాధితో ఎదగాలి

## అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కంఠం శిరీష కృష్ణారెడ్డి



**శామీర్ పేట,సెప్టెంబర్ 16 (జనం సాక్షి )**యువత స్వయం ఉపాధిపై ఆధారపడి ఆర్థికంగా ముందుకు సాగాలని అలియాబాద్ మున్సిపాలిటీ చైర్ పర్సన్ కంఠం శిరీష కృష్ణ రెడ్డి అన్నారు. బుధ వారం అలియాబాద్ మున్సిపాలిటీలో నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ కట్ట మైసమ్మ వెల్డింగ్ షాప్ ను ఆమె స్థానిక కౌన్సిలర్లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ..యువత ప్రభుత్వ ఉద్యోగాల కోసం ఎదురుచూడకుండా సొంతంగా వ్యాపారాలు నిర్వహించి పదిమందికి మార్గదర్శకంగా నిలవాలన్నారు. ఈ సందర్భంగా శ్రీ కట్ట మైసమ్మ వెల్డింగ్ షాప్ నిర్వాహకుడు మేడిపల్లి శివను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ కాన్రెడ్డి మాలతి మాధవరెడ్డి, కౌన్సిలర్లు దినేష్ మౌనిక, శ్యామ్ యమున, జస్వంత్ రెడ్డి, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కొలన్ సులోచన మృతికి మైనాంపల్లి హన్మంత్ రావు సంతాపం



**నిజాంపేట్ సెప్టెంబర్ 16 జనం సాక్షి:**:కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి మాతృమూర్తి, . కొలన్ సులోచన ఈ నెల 9 వ తేదీన అకాల మరణం చెందడంతో, బుధవారం ఆయన నివాసానికి పలువురు ప్రముఖులు విచ్చేసి సంతాపం తెలిపారు..ఈ సందర్భంగా మల్కాజగిరి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మాజీ ఎమ్మెల్యే మైనాంపల్లి హన్మంత్ రావు కొలన్ హన్మంత్ రెడ్డి నివాసానికి వెళ్లి హనుమంత్ రెడ్డిని పరామర్శించి, సులోచనమ్మ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులు అర్పించారు. సులోచన మృతి పట్ల వారు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఆమె ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారుఈ కార్యక్రమం లో సీనియర్ కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ జనరల్ సెక్రటరీగా బొడిగె కృష్ణ గౌడ్

## మేడిపల్లి 9వ డివిజన్ కాంగ్రెస్‌లో కీలక బాధ్యత



**మేడిపల్లి-- సెప్టెంబర్ 16 జనంసాక్షి:** మేడ్చల్--మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ మేడిపల్లి 9వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగా సీనియర్ నాయకుడు బొడిగె కృష్ణ గౌడ్ ఎన్నికయ్యారు. పార్టీ అధిష్టానం ఆయనకు కీలక బాధ్యతలు అప్పగించింది.ఈ సందర్భంగా బొడిగె కృష్ణ గౌడ్‌కు బీఎస్‌కేజీ యువసేన సభ్యులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృష్ణ గౌడ్ మరింత కృషి చేయాలని ఆకాంక్షించారు.

# వినాయకుడి సన్నిధిలో పైలెట్ రోహిత్ రెడ్డి



**తాండూరు సెప్టెంబర్ 16 (జనంసాక్షి)**తాండూరు పట్టణంలోని వివిహెచ్ ఎస్ స్కూల్ సమీపంలో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వినాయక మండపాన్ని మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి సందర్శించి, గణేశుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా తాండూరు ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని స్వామివారిని ప్రార్థించారు. కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, హిందూ ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

## ఈపీఎఫ్ వేతన పరిమితి పెంపుపై బీఎంఎస్ హర్షం



**ముషీరాబాద్, సెప్టెంబర్ 16 (జనం సాక్షి):** ఉద్యోగుల భవిష్యనిధి (ఈపీఎఫ్) వేతన పరిమితిని నెలకు రూ.15,000 నుంచి రూ.25,000కు పెంచుతూ కేంద్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని భారతీయ మజ్దూర్ సంఘ్ (బీఎంఎస్) స్వాగతించింది. ఈ నిర్ణయం సెప్టెంబర్ 17, 2026 నుంచి అమల్లోకి రావడం సంతోషకరమని బీఎంఎస్ అఖిల భారత అధ్యక్షుడు సుంకరి మల్లేశం తెలిపారు. ఈ నిర్ణయం ద్వారా యాజమాన్యం ఈపీఎఫ్ కాంట్రిబ్యూషన్ నెలకు రూ.1,800 నుంచి రూ.3,000 వరకు పెంచాల్సి ఉంటుందని, ఉద్యోగి వాటా కూడా నెలకు రూ.3,000 వరకు జమ అవుతుందని బీఎంఎస్ తెలిపింది. అయితే వాస్తవంగా అమలు చేసే కాంట్రిబ్యూషన్ విధానం సంబంధిత ఈపీఎఫ్ నిబంధనల ప్రకారం నిర్ధారించబడుతుంది. కార్మికుల సామాజిక భద్రతను బలోపేతం చేసే ఈ నిర్ణయం తీసుకున్న ప్రధానమంత్రి, కేంద్ర కార్మిక, ఉపాధి శాఖ మంత్రి, కేంద్ర మంత్రివర్గానికి బీఎంఎస్ అఖిల భారత అధ్యక్షుడు సుంకరి మల్లేశం కృతజ్ఞతలు తెలిపారు

## డ్రగ్స్ ఉచ్చులో పడొద్దు!

### సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి.. పోలీసుల సూచన



**అల్వాల్, సెప్టెంబరు 16 (జనంసాక్షి):** :యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, సైబర్ నేరగాళ్ల మాయలో పడకుండా అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. 'మీ సురక్ష సహచరి' కార్యక్రమంలో భాగంగా మంగళవారం అల్వాల్ పోలీస్‌స్టేషన్ సమీపంలోని గణేష్ మండపం వద్ద 'సే నో టు డ్రగ్స్'పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్ హెచ్ ఓ ప్రశాంత్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి బేగంపేట డివిజన్ ఏసీపీ పి.గోపాలకృష్ణమూర్తి, నార్కోటిక్ బ్యూరో ఏసీపీ హరీష్‌చంద్రారెడ్డి హాజరయ్యారు. డ్రగ్స్ వినియోగం యువత ఆరోగ్యం, కుటుంబ జీవితంపై తీవ్ర ప్రభావం చూపుతుందని తెలిపారు. మాదకద్రవ్యాల వినియోగం, విక్రయాలపై సమాచారం ఉంటే 1908 టోల్‌ఫ్రీ నంబర్‌కు తెలియజేయాలని, సమాచారం ఇచ్చేవారి వివరాలను గోప్యంగా ఉంచుతామని చెప్పారు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, మహిళల భద్రత, ట్రాఫిక్, ఆహార భద్రతపై జాగ్రత్తలు పాటించాలని సూచించారు. కార్యక్రమంలో డీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐలు, పోలీసు సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

## ఈనెల 19 న శామీర్ పేట్ ఎస్ జి ఎఫ్ క్రికెట్ సెలక్షన్స్ పోటీలు



**శామీర్ పేట్, సెప్టెంబర్ 16(జనం సాక్షి** )స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్ జి ఎఫ్ ) ఆధ్వర్యం లో ఉమ్మడి శామీర్ పేట్ మండలం( షామీర్పేట్ మరియు ఎంసిపల్లి మండలాలకు ) చెందిన బాలురు క్రికెట్ సెలక్షన్స్ ఈ నెల 19వ తేదీ శాంతిని కేతన్ విద్యాలయం స్కూల్ బొమ్మ రాసిపేట్ లో నిర్వహిస్తున్నట్లు శామీర్ పేట్ జోనల్ క్రీడల కార్య దర్శి గుర్రం సత్తిరెడ్డి తెలిపారు. 01-01-2010 తర్వాత జన్మించిన వారై ఉండాలని అండర్ 14 విభాగంలో పాల్గొనే క్రీడాకారులు 01-01-2013 తర్వాత జన్మించిన వారే ఉండాలని ఒరిజినల్ ఆధార్ కార్డ్ తో పాటు ఎలిజిబులిటీ ఫార్మ్ 19వ తేదీ ఉదయం 9 గంటలకు శాంతినికేతన్ విద్యా లయ స్కూల్ లో రిపోర్ట్ చేయాలని, ఎవరికిట్టు వారే తెచ్చుకోవాలని ఆయన అన్నారు. మిగతా వివరాలకు మదన్ మోహన్ రెడ్డి (92461 90425) సంప్రదించాలని తెలిపారు.

# విద్యా సేవలకు ఘన గౌరవం

### మండల ఉత్తమ ఉపాధ్యాయులకు సన్మానం




**కోట్ పల్లి, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):**విద్యార్థుల భవిష్యత్తుకు బాటలు వేస్తూ, విద్యారంగంలో అంకితభావంతో విశిష్ట సేవలు అందిస్తున్న ఉపాధ్యాయులను గుర్తించి గౌరవించడం అభినందనీయమని పలువురు పేర్కొన్నారు. కోట్ పల్లి మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో మండల ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం--2026 (మండల ఉత్తమ ఉపాధ్యాయులకు అవార్డ్స్ బుధవారం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మధ్యాహ్నం 1:30 గంటలకు ప్రారంభమైన ఈ కార్యక్రమంలో మండల పరిధిలో విద్యారంగానికి విశేష సేవలు అందించిన ఉపాధ్యాయులు, విద్యా సిబ్బందిని ఘనంగా సత్కరించారు. ఉత్తమ సేవలకు గుర్తింపుగా ఎంపికైన వారికి మెమొంటో, శాలువా, పూలదండ, ప్రశంసాపత్రం అందజేసి అభినందనలు తెలిపారు. 14 మందికి ఉత్తమ ఉపాధ్యాయుల పురస్కారాలుమండల ఉత్తమ ఉపాధ్యాయులుగా ఎంపికైన వారిలో జీ. పల్లవి రెడ్డి -- ఎస్ఓ అండ్ ప్రిన్సిపాల్, కేజీబీవీ కరీంపూర్ గేట్, జె. లత -- ఎస్‌జీటీ, ఎంపీపీఎస్ కోట్ పల్లి, అర్షియా -- ఎస్‌జీటీ, ఎంపీపీఎస్ యెన్నారం, ఎం. నాగమణి -- ఎస్‌జీటీ, ఎంపీయూపీఎస్ కొత్తపల్లి, ఎ. తిరుపతి -- ఎస్ఏ (హిందీ), జెడ్పీహెచ్ఎస్ మోత్కుపల్లి, స్వప్న యెలుగోయి -- ఎస్ఏ (హిందీ), జెడ్పీహెచ్ఎస్ బర్వాద్, కనీజ్ ఫాతిమా -- ఎస్‌జీటీ, కోట్ పల్లి, ముబీన్ ఫాతిమా -- ఎస్‌జీటీ, కోట్ పల్లి, ఎం. ప్రణయ్ కుమార్ -- ఎస్‌జీటీ, ఎంపీపీఎస్ యెంకపల్లి, ఆర్. మహేందర్ -- ఎస్‌జీటీ, ఎంపీపీఎస్ యెంకపల్లి, కె. నర్సింహులు -- సీఆర్‌పీ, జెడ్పీహెచ్ఎస్ కోట్ పల్లి, బి. నర్సిరెడ్డి -- సీఓ, ఎంఆర్‌సీ కోట్పల్లి, లోక్య -- ఐఈఆర్‌పీ, కోట్పల్లి, దిలీప్ -- ఐఈఆర్‌పీ, కోట్పల్లి ఉన్నారు. విద్యార్థుల భవిష్యత్తులో ఉపాధ్యాయులదే కీలక పాత్ర సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో జ్ఞానం, క్రమశిక్షణ, సృజనాత్మకత, సామాజిక బాధ్యతలను పెంపొందించడంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. తరగతి గదిలో బోధనకే పరిమితం కాకుండా విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి ఉపాధ్యాయులు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ఉత్తమ సేవలకు పురస్కారాలు అందుకోవడం ఇతర ఉపాధ్యాయులకు కూడా మరింత స్ఫూర్తినిస్తుందని తెలిపారు. అధికారులు, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయుల హాజరుకార్యక్రమంలో కోట్ పల్లి ఎంపీడీఓ హేమంత్, మండల విద్యాశాఖ అధికారి చంద్రప్ప, ప్రధానోపాధ్యాయులు, మండల అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, విద్యా సిబ్బంది, ప్రజాప్రతినిధులు, విద్యారంగ ప్రముఖులు పాల్గొన్నారు. ప్రధానోపాధ్యాయులు ఆర్. అరుణ్ కుమార్ (మోత్కుపల్లి), వేణుగోపాల్ (జెడ్పీహెచ్ఎస్ బర్వాద్), శారద (యెన్నారం)తో పాటు విశ్వేశ్వర్, నవీన్ రాజ్ కుమార్, మహిపాల్ రెడ్డి, ముత్యం రెడ్డి, రామచందర్, స్పెషల్ ఆఫీసర్ పల్లవి తదితరులు పాల్గొని ఉత్తమ ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. అదేవిధంగా ఫాతిమాభీ, ఫాతిమా బేగం, యాస్మిన్ బేగం తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఉపాధ్యాయులకు హృదయపూర్వక శు భాకాంక్షలువిద్యార్థులను విజ్ఞానవంతులుగా తీర్చిదిద్దుతూ, వారి భవిష్యత్తుకు దిశానిర్దేశం చేస్తున్న ఉపాధ్యాయుల సేవలను ఈ సందర్భంగా కొనియాడారు. సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర చిరస్మరణీయమని పేర్కొంటూ ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయుల సేవలను గుర్తించి, వారిని ప్రోత్సహించే లక్ష్యంతో నిర్వహించిన మండల ఉత్తమ ఉపాధ్యాయుల సన్మాన కార్యక్రమం--2026 విజయవంతంగా ముగిసింది. కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు, అధికారులు, ఉపాధ్యాయులు, విద్యా సిబ్బంది, పత్రికా ప్రతినిధులకు మండల విద్యాశాఖ తరపున కృతజ్ఞతలు తెలిపారు.

# సెల్ ఫోన్ దొంగల పట్ల అప్రమత్తంగా ఉండాలి

### డీసీపీ యోగేష్ గౌతమ్




**మొయినాబాద్ జనం సాక్షి సెప్టెంబర్ 16:** సెల్ ఫోన్ దొంగల వట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, సాంకేతిక పరిజ్ఞానంతో పోగొట్టుకున్నఫోన్లను రికవరీ చేస్తున్నామని ఫ్యూచర్ సిటీ చేవెళ్ల డీసీపీ యోగేష్ గౌతమ్ పేర్కొన్నారు. బుధవారం మొయినాబాద్ పోలీస్ స్టేషన్ ఆవరణలో రికవరీ చేసిన ఫోన్లను మొయినాబాద్ సీఐ మల్లికార్జున్రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీసీపీ యోగేష్ గౌతమ్ పాల్గొని చేవెళ్ల డీసీపీ పరిధిలో ఉన్న చేవెళ్ల, శంషాబాద్, షాబాద్, శంకర్పల్లి, మోకి ల, మొయినాబాద్ పోలీస్ స్టేషన్ల వరిధిలో చోరీకి గురై పోగొట్టుకున్న 157 సెల్ ఫోన్లను ఐఎంఈఐ నెంబర్ల ఆధారంగా ట్రాకింగ్ చేసి ధృవీకరణ పత్రాలను పరిశీలించిన అనంతరం అసలైన యజమానులకు ఆయన చేతుల మీదుగా అందజేశారు. చేవెళ్ల డీసీవ్ వరిధిలో సెల్ఫోన్లు పోయినవి శంకర్పల్లి 143కు 55 రికవరీ, మోకిల 30కి 22, చేవెళ్ల 115కు 26, మొయినాబాద్ 203కు 72, షాబాద్ 54కు 24, శంషాబాద్ 118కి 19 రికవరీ చేసినట్లు ఆయన సూచించారు. రికవరీ చేసిన వారికి రిఫండ్ అవార్డు అందజేసి అభినందించారు. రద్దీ ప్రాంతాలు, మార్కెట్లు, బస్సు ప్రయాణాల్లో మొబైల్ ఫోన్ల వట్ల జాగ్రత్తగా ఉండాలని తెలియని వ్యక్తుల నుంచి చౌకగా లభించే పాత ఫోన్లను కొనుగోలు చేయవద్దని సూచించారు. సెల్ఫోన్లో ఆర్థిక లావాదేవీలు, వ్యక్తిగత సమాచారం ఉండడంతో ఫోన్ పోగొట్టుకుంటే ఆర్థిక నష్టంతో పాటు గోవ్యతకు భంగం కలిగే ప్రమాదం ఉందన్నారు. ఫోన్ పొగొట్టుకున్న వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తే సాంకేతిక విభాగం సహాయంతో త్వరగా గుర్తించే అవకాశం ఉంటుందని అన్నారు. ఫోన్లు తిరిగి పొందిన బాధితులు పోలీసుల చోరవకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మొయినాబాద్ సీఐ వై. మల్లికార్జున్రెడ్డి, ఎస్సైలు వెంకన్న, సుభాష్, సత్యనారాయణ ఇతర పోలీస్ స్టేషన్ల సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# మేడిపల్లి పోలీస్ స్టేషన్ నూతన డీఐగా కే.శ్రీనివాస్ బాధ్యతల స్వీకారం



**బోడుప్పల్- సెప్టెంబర్ 16:జనంసాక్షి:**:మేడిపల్లి పోలీస్ స్టేషన్ డిటెక్టివ్ ఇన్స్పెక్టర్ గా కే. శ్రీనివాస్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కంటోన్మెంట్ ఎస్ఓటీలో విధులు నిర్వహిస్తున్న ఆయన బదిలీపై మేడిపల్లి పోలీస్ స్టేషన్‌కు వచ్చి నూతన డీఐగా బాధ్యతలు చేపట్టారు. ఇప్పటివరకు మేడిపల్లి పోలీస్ స్టేషన్ డీఐగా విధులు నిర్వహించిన ఎలక్షన్ రెడ్డి కంటోన్మెంట్ ఎస్ఓటీకి బదిలీ కావడంతో, ఆయన స్థానంలో కే.శ్రీనివాస్‌ను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం డీఐ శ్రీనివాస్ పోలీస్ స్టేషన్ సిబ్బందితో సమావేశమయ్యారు. పోలీస్ స్టేషన్ పరిధిలోని శాంతిభద్రతల పరిస్థితి, నేరాల నియంత్రణ చర్యలు, పెండింగ్ కేసుల పురోగతి, ప్రజలకు అందిస్తున్న సేవలు తదితర అంశాలపై అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా డీఐ శ్రీనివాస్ మాట్లాడుతూ మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల నియంత్రణకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తామని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యలను వేగంగా పరిష్కరించేందుకు చర్యలు చేపడతామని చెప్పారు. శాంతిభద్రతల పరిరక్షణతో పాటు ప్రజలకు మరింత మెరుగైన పోలీస్ సేవలు అందించడమే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

# సాయుధ పోరాట అమరులను స్మరించుకుందాం

## నేడు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో భారీ బహిరంగ సభ




**అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 16 (జనం సాక్షి):**వెట్టి చాకిరీ విముక్తి కోసం, నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవం కోసం సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట అమరులను స్మరించుకోవాలని సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారి, రాష్ట్ర సమితి సభ్యులు ముత్యాల యాదిరెడ్డి పిలుపునిచ్చారు. సెప్టెంబర్ 11 నుంచి 17 వరకు నిర్వహిస్తున్న తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట వారోత్సవాల్లో భాగంగా నేడు నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న భారీ బహిరంగ సభకు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రజాకార్లు, దేశ్‌ముఖ్‌ల అరాచకాలకు వ్యతిరేకంగా సాగిన తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటం ప్రపంచ చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించదగినదన్నారు. ఈ పోరాట చరిత్రను కనుమరుగు చేసేందుకు కొన్ని శక్తులు అది హిందూ--ముస్లింల మధ్య జరిగిన పోరాటంగా తప్పుడు ప్రచారం చేస్తున్నాయని విమర్శించారు. వాస్తవానికి అది మట్టి మనుషులు తమ హక్కులు, ఆత్మగౌరవం కోసం చేసిన పోరాటమని పేర్కొన్నారు.ఆ పోరాట ఫలితంగా కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో తెలంగాణలో సుమారు పది లక్షల ఎకరాల భూమిని పేదలకు పంచిన చరిత్ర ఉందన్నారు. వీర తెలంగాణ సాయుధ పోరాట చరిత్రను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రతి ఏటా వారోత్సవాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. అమరుల పోరాట స్ఫూర్తిని కొనసాగిస్తూ, వారి త్యాగాలను స్మరించుకునేందుకు నేడు నిర్వహించే బహిరంగ సభకు ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీపీఐ బాలాపూర్ మండల కార్యదర్శి చంద్రశేఖర్‌రెడ్డి, మున్సిపల్ ఎంప్లాయిస్ రాష్ట్ర కార్యదర్శి జైపాల్‌రెడ్డి, మెట్టు మండల కౌన్సిల్ సభ్యులు నిరంజన్ తదితరులు పాల్గొన్నారు.

# సాయి నగర్ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గానికి శుభాకాంక్షలు



**హయత్‌నగర్, సెప్టెంబర్ 16 (జనం సాక్షి)**హయత్‌నగర్ డివిజన్‌లోని సాయి నగర్ కాలనీ నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘం సభ్యులు మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డిని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా నవజీవన్ రెడ్డి నూతనంగా ఎన్నికైన సంక్షేమ సంఘం సభ్యులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కాలనీ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం సంక్షేమ సంఘం చేస్తున్న కార్యక్రమాలకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా అందిస్తానని తెలిపారు. అనంతరం సాయి నగర్ కాలనీలో నిర్వహించనున్న గణేష్ నవరాత్రి ఉత్సవాల్లో పాల్గొనాలని కోరుతూ సంక్షేమ సంఘం సభ్యులు మాజీ కార్పొరేటర్ నవజీవన్ రెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు సీహెచ్. రామచంద్రం, ప్రధాన కార్యదర్శి యానాల కృష్ణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ వి. రామ్ రెడ్డి, ట్రెజరర్ భూపాల్ రెడ్డి, జాయింట్ సెక్రెటరీ ప్రసాద్, ఈసీ సభ్యులు సీతారాం, బాలరాజ్ గౌడ్, కృష్ణ గౌడ్, సంజీవ రెడ్డి, రాఘవ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కార్మికుల పెండింగ్ సమస్యలు వెంటనే పరిష్కరించాలి

## సీఐటీయూ ఆధ్వర్యంలో పెద్ద అంబర్‌పేట్ కార్యాలయం ఎదుట ధర్నా



**అబ్దుల్లాపూర్‌మెట్, సెప్టెంబర్ 16 (జనం సాక్షి):**నాగోల్ సర్కిల్ పరిధిలోని పెద్ద అంబర్‌పేట్ కార్యాలయం ఎదుట కార్మికుల పెండింగ్ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం ధర్నా నిర్వహించారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ ఏ. సంపత్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన సీఐటీయూ జిల్లా నాయకులు ఎర్రుల నర్సింహా మాట్లాడుతూ.. మున్సిపల్ కార్మికులకు రావాల్సిన దుస్తులు, చెప్పులు, సబ్బులు, నూనెలు, షూలు, రెయిన్‌కోట్లు తదితర సౌకర్యాలను వెంటనే కల్పించాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీ ఏర్పడినప్పటి నుంచి కార్మికుల వేతనాల నుంచి పీఎఫ్, ఈఎస్ఐ పేరుతో నగదు కట్ చేస్తున్నప్పటికీ, వాటిని సంబంధిత ఖాతాల్లో సక్రమంగా జమ చేయడం లేదని ఆరోపించారు.గత పాలకవర్గం పదవీకాలం ముగిసిన అనంతరం అప్పటి కమిషనర్ రవీందర్‌రెడ్డి హయాంలో కూడా కార్మికులకు రావాల్సిన సౌకర్యాలు కల్పించలేదని అన్నారు. ప్రస్తుతం కూడా అదే పరిస్థితి పునరావృతం కాకుండా కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిప్యూటీ కమిషనర్‌ను కోరారు.డిప్యూటీ కమిషనర్ సంపత్‌కుమార్ స్పందిస్తూ.. గతంలో జరిగిన విధంగా ఇకపై జరగదని, నాగోల్ సర్కిల్ పరిధిలో సుమారు 400 మంది కార్మికులు ఉన్నారని, వారందరికీ సమానంగా న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు గుండె శివకుమార్, వర్కాల బాలరాజ్‌తో పాటు కార్మికులు మైసయ్య, జంగయ్య, లింగస్వామి, జగన్, మైపాల్, నరేష్ తదితరులు, పలువురు మహిళా కార్మికులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ ఉపాధ్యక్షుడిగా కిరణ్ కుమార్ సంగం



**రాజేంద్రనగర్,సెప్టెంబర్16(జనంసాక్షి)** రంగారెడ్డి జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడిగా కిరణ్ కుమార్ సంగం నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి బుధవారం ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.తనపై నమ్మకంతో జిల్లా ఉపాధ్యక్షుడిగా అవకాశం కల్పించిన జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో, పీసీసీ అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మార్గదర్శకత్వంలో పార్టీ బలోపేతానికి అంకితభావంతో పనిచేస్తానని, పార్టీ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ, ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను విస్తృతంగా తీసుకెళ్లేందుకు కృషి చేస్తానన్నారు. పార్టీ అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తూ, కాంగ్రెస్ కార్యకర్తలకు అందుబాటులో ఉంటానని తెలిపారు.

# కార్మికుల అక్రమ నిర్బంధాన్ని ఆపాలి

## సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్




**ముషీరాబాద్, సెప్టెంబర్ 16 (జనం సాక్షి):**సంఘటిత, అసంఘటిత రంగాలకు చెందిన కార్మికులను ముందస్తు అరెస్టుల పేరుతో పోలీస్ స్టేషన్లలో అక్రమంగా నిర్బంధిస్తూ భయభ్రాంతులకు గురిచేస్తున్నారని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పాలడుగు భాస్కర్ ఆరోపించారు. కార్మికులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిరంకుశ వైఖరిని అవలంబిస్తోందని విమర్శించారు. ఈ మేరకు బుధవారం హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్దగల ధర్నా చౌక్లో కార్మికుల నిర్బంధానికి నిరసనగా సీఐటీయూ, ఏఐటీయూసీ, బీఆర్‌టీయూ తదితర కార్మిక సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో సామూహిక నిరసన దీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మిక సంఘాల నేతలు మాట్లాడుతూ తమ న్యాయమైన సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాల్సిన బాధ్యత ఉందన్నారు. సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు రాజధానికి వచ్చిన కార్మికులను నిర్బంధించడం ప్రజాస్వామ్య హక్కులను హరించడమేనని పేర్కొన్నారు.పాలడుగు భాస్కర్ మాట్లాడుతూ ప్రజా తెలంగాణలో పోలీసు రాజ్యం కొనసాగుతున్నట్లుగా పరిస్థితి ఉందని విమర్శించారు. రాజ్యాంగం కల్పించిన మేరకు కార్మిక సంఘాలకు సంఘాలు ఏర్పాటు చేసుకోవడం, నిరసనలు, సమ్మెలు నిర్వహించే హక్కులు ఉన్నాయని తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా తన వైఖరిని పునరాలోచించాలని కోరారు. కార్మికుల హక్కులను కాలరాస్తే చూస్తూ ఊరుకునేది లేదని స్పష్టం చేశారు. బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యబద్ధంగా జరిగే కార్మిక పోరాటాలకు ముఖ్యమంత్రి సహకరించాలని కోరారు. కార్మికులకు ఇచ్చిన హామీల అమలుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని, లేదంటే కార్మిక సంఘాలు ఐక్యంగా ఉద్యమించాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు. జస్టిస్ చంద్రకుమార్ మాట్లాడుతూ కార్మికులకు రాజ్యాంగం కల్పించిన హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు ప్రభుత్వం చర్యలు తీసుకోని పక్షంలో న్యాయపరంగా హైకోర్టును ఆశ్రయించాల్సి వస్తుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితాలో లోపాలు సరిచేయాలి

## పోలింగ్ కేంద్రాల కేటాయింపుపై బీజేపీ వినతి



**అల్వాల్, సెప్టెంబరు 16 (జనంసాక్షి):** ఓటరు జాబితా సవరణలో తలెత్తిన లోపాలను సరిచేసి, పోలింగ్ కేంద్రాల కేటాయింపులో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అల్వాల్ సర్కిల్ బీజేపీ నాయకులు డిప్యూటీ కమిషనర్, ఎన్నికల అధికారికి వినతిపత్రం సమర్పించారు.అల్వాల్ సర్కిల్ పరిధిలో ఓటరు గుర్తింపు కార్డుల్లో నమోదైన ఇంటి చిరునామాలు, డోర్ నంబర్లలో వ్యత్యాసాలు ఉన్నాయని వారు పేర్కొన్నారు. ఒకే ఇంటికి చెందిన ఓటర్లు రెండు, మూడు వేర్వేరు పోలింగ్ కేంద్రాలకు కేటాయించబడిన సందర్భాలు తమ దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్వాల్ సర్కిల్ మూడు డివిజన్ల అధ్యక్షులు కార్తీక్‌గౌడ్, అజిత్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డితో పాటు సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, మల్లికార్జున్‌గౌడ్, మాణిక్యరెడ్డి, దండుగుల వెంకటేష్, మాధవ్, రామ్మోహన్‌గౌడ్, శేఖర్, లక్ష్మణ్ ముదిరాజ్, నరేందర్‌రెడ్డి, మొయి సుజాత, పద్మిని, జ్యోతి తదితరులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మణికొండ పాఠశాలలో మాదిరి ఎన్నికలు




**రాజేంద్రనగర్,సెప్టెంబర్16(జనంసాక్షి)**పీఎంశ్రీ జడ్పీహెచ్ఎస్ మణికొండ పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి మాదిరి ఎన్నికలు నిర్వహించారు. 6 నుంచి 10వ తరగతి విద్యార్థులు పాల్గొని మొత్తం 911 ఓట్లు వేశారు. 14 మంది విద్యార్థులు పోటీ చేయగా, 6 మంది అబ్బాయిలు, 8 మంది అమ్మాయిలు ఉన్నారు. అమ్మాయిల విభాగంలో గొల్ల పవిత్ర 339 ఓట్లతో, అబ్బాయిల విభాగంలో గొల్ల చందు 336 ఓట్లతో పాఠశాల లీడర్లుగా ఎన్నికయ్యారు. విద్యార్థులకు ఓటు హక్కు, ప్రజా ప్రతినిధుల ఎన్నిక విధానంపై అవగాహన కల్పించేందుకు ఈ కార్యక్రమం నిర్వహించారు. సామాజిక శాస్త్ర ఉపాధ్యాయులు వరలక్ష్మి, విజయ్‌కుమార్, కిషన్, సత్తయ్య పాఠశాల బృందం సహకారంతో ఎన్నికలను నిర్వహించారు. ప్రధానోపాధ్యాయురాలు అరుణకుమారి, వెంకటప్ప, శివరాం, స్థానిక మాజీ కౌన్సిలర్ రామ కృష్ణ రెడ్డి, మణికొండ డివిజన్ అధ్యక్షుడు బుద్దోలు శ్రీరాములు,నార్సింగి ఏఎంసి డైరెక్టర్ ఎర్పుల కుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ఏర్పుమళ్ళ యుపిఎస్ పాఠశాలను సందర్శించిన రాష్ట్ర ఎఫ్ఎల్ఎన్ బృందం



**బొంరాస్ పేట, సెప్టెంబర్ 16 (జనం సాక్షి):** మండల పరిధిలోని ఏర్పుమళ్ళ ప్రాథమికోన్నత పాఠశాలను బుధవారం రాష్ట్ర ఎఫ్ఎల్ఎన్ బృందం సందర్శించింది. ఈ సందర్భంగా పాఠశాలలో తరగతి బోధనను పరిశీలించారు.ఎఫ్ఎల్ఎన్ అమలు టిఎల్ఎం వినియోగం తదితర అంశాలను పరిశీలించి వెనకబడ్డ విద్యార్థుల కోసం అనుసరించాల్సిన ప్రత్యేక బోధనా విధానాన్ని వివరించారు. అనంతరం పాఠశాలలో రికార్డులను పరిశీలించారు.ఈ కార్యక్రమంలో క్లస్టర్ ప్రధానోపాధ్యాయులు రవీందర్ గౌడ్, స్థానిక పాఠశాల ప్రధానోపాధ్యా యులు వెంకట్ రెడ్డి, ఉపాధ్యాయులు సర్దార్ ,ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులపంపిణీ



**మల్కాజిగిరి సెప్టెంబర్ 16 (జనం సాక్షి)**తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స ఖర్చులు భరించలేని నిరుపేద కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి పెద్ద ఆసరాగా నిలుస్తోందని మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మల్కాజిగిరి డివిజన్‌కు చెందిన నలుగురు లబ్ధిదారులకు ప్రభుత్వం నుంచి మంజూరైన 1.28 లక్షల విలువైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మాజీ కార్పొరేటర్ జగదీష్ గౌడ్‌తో కలిసి ఆయన లబ్ధిదారులకు అందజేశారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ. పేదల ఆరోగ్య సంరక్షణకు తమ వంతు సహాయాన్ని ఎల్లప్పుడూ అందిస్తామని తెలిపారు. అనారోగ్యంతో దరఖాస్తు చేసుకున్న గంగాధరి కృష్ణకు 32 వేలు, మురాడి లలిత18 వేలు, నందు కుమార్ 42 వేలు, అండాలుకు 36 వేల చొప్పున ఆర్థిక సహాయం మంజూరైనట్లు వివరించారు. సమయానికి ఆర్థిక సాయం అందేలా చొరవ చూపినందుకు బాధితులు, వారి కుటుంబసభ్యులు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు వీరేశం యాదవ్, పరశురాంరెడ్డి, జేఏసీ వెంకన్న, వెంకటేశ్ గౌడ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# అసైన్మెంట్ భూమిలో దళితులకు హక్కులు కల్పించాలి



**నిజాంపేట్ సెప్టెంబర్ 16 జనం సాక్షి:**దుండిగల్ సర్కిల్ 59 పరిధిలోని బౌరంపేట్ సర్వేనెంబర్ 472 ప్రభుత్వ స్థలం గతంలో అసైన్డ్ ల్యాండ్ దారులకు అప్పగించిన దళితులకు ఆ భూమి వారికి న్యాయం చేయాలని కోరుతూ బౌరంపేట్ మాజీ సర్పంచ్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షురాలు కొమ్ము మంగమ్మ తెలిపారు ఈ మేరకు బుధవారం మంగమ్మ నేతృత్వంలో పెద్ద సంఖ్యలో దళితుల తో కలిసి మల్కాజ్గిరి ఆర్డిఓ శ్యాం ప్రకాష్ ను మర్యాదపూర్వకంగా కలిసి వినతి పత్రం అందజేశారు.. ఈ సందర్భంగా ఆర్డీవోకు దళితుల సమస్యలను వివరిస్తూ . సర్వేనెంబర్ 472లో గత 75 సంవత్సరాలుగా 100 కుటుంబాల దళితులు వ్యవసాయం చేస్తూ జీవనోపాధి పొందుతున్నారని, ప్రస్తుతం ప్రభుత్వం ఆ స్థలాన్ని స్వాధీనం చేసుకోవడంతో ఇబ్బందికరమైన పరిస్థితి ఉందని వివరించారు. అదే భూమిని నమ్ముకుని బతుకుతున్న దళితులకు ప్రభుత్వం ఉదార స్వభావంతో సహాయం చేయాలని వారు అభ్యర్థించారు. దుండిగల్ గ్రామంలో ఇటీవల అసైన్మెంట్ వాసుల నుండి ప్రభుత్వం తిరిగి భూములు తీసుకుంటున్న సందర్భంలో ప్రతి ఎకరాకు సుమారు 700 గజాల అభివృద్ధి పరిచిన భూమిని అసైన్మెంట్ వాసులకు ఇవ్వడానికి రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించిందని వారు గుర్తు చేశారు. అదే పద్ధతిని బౌరంపేట అసైన్మెంట్ దారులైన దళితులకు కూడా వర్తింపచేయాలని వారు కోరారు. సర్వే నెంబర్ 472లో మొత్తం 32 ఎకరాల ప్రభుత్వ స్థలాన్ని అసైన్మెంట్ దారులకు ఎలాంటి నోటీసులు ఇవ్వకుండానే ప్రభుత్వం వాపస్ తీసుకుందని వారు గుర్తు చేశారు. అదే భూమిపై వ్యవసాయం చేసుకుని ఇంతకాలం జీవనోపాధి పొందిన దళితులకు ప్రతి వారికి ఎకరాకు 1000 గజాల చొప్పున అభివృద్ధి పరిచిన ప్రభుత్వ భూమిని అందించాలని విన్నవించారు. ఈ విషయమై ఇటీవల దుండిగల్ మండల తహసీల్దారుకు సైతం అందజేసినట్లు తెలిపారు ఈ సందర్భంగా మల్కాజ్గిరి ఆర్డిఓ శ్యాంప్రకాష్ మాట్లాడుతూ సమస్య కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఆర్డీవో ని కలిసిన వారిలో డప్పు కిష్టయ్య, కొమ్ము వీరయ్య, కొమ్ము యాదయ్య, డప్పు సురేష్, డప్పు జీవన్, కే రమేష్, నరేష్, చింతకింది రాములమ్మ, చింతకింది ముత్తమ్మ, బాల గారి బాషమ్మ, డప్పు అనసూయ తదితరులు పాల్గొన్నారు ఉన్నారు.

# మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షునిగా పాశం రాజు యాదవ్

### నియామక పత్రం అందజేసిన డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్



**బోడుప్పల్-జనంసాక్షి::**మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షునిగా పాశం రాజు యాదవ్ నియమితులయ్యారు. ఈ మేరకు మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.ఈ సందర్భంగా వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న కార్యకర్తలకు పార్టీ సముచిత గుర్తింపు ఇస్తోందన్నారు. క్షేత్రస్థాయిలో పార్టీ కార్యక్రమాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించడంలో పాశం రాజు యాదవ్ చురుకైన పాత్ర పోషించాలని సూచించారు.నియామక పత్రం అందుకున్న పాశం రాజు యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి బాధ్యతలు అప్పగించిన పార్టీ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం అంకితభావంతో పనిచేస్తూ, ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. మేడిపల్లి డివిజన్‌లో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కార్యకర్తలతో కలిసి సమన్వయంతో ముందుకు సాగుతానని పేర్కొన్నారు..ఈ సందర్భంగా మేడ్చల్ జిల్లా బీ-బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, పీర్జాదిగూడ మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్,మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి తదితర పార్టీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# ఎమ్మెల్యే సహకారంతో తాగునీటి సమస్యకు పరిష్కారం

### తాండూరు ఏఎంసీ మాజీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి



**యాలాల సెప్టెంబర్ 16 ( జనం సాక్షి ) :** కోకట్ గ్రామంలో నెలకొన్న తాగునీటి సమస్యకు ఎమ్మెల్యే సహకారంతో పరిష్కారం లభించిందని తాండూరు ఏఎంసీ మాజీ చైర్మన్ పట్లోళ్ల బాల్‌రెడ్డి తెలిపారు. గ్రామ ప్రజల తాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని రెండు మోటార్లను ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు.గ్రామంలో తాగునీటి సరఫరాకు ఇబ్బందులు ఎదురవుతున్న విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లగా, వెంటనే స్పందించి మోటార్ల ఏర్పాటుకు సహకరించారని బాల్‌రెడ్డి తెలిపారు. రెండు మోటార్లు అందుబాటులోకి రావడంతో గ్రామంలో తాగునీటి సమస్య గణనీయంగా తగ్గుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా గ్రామ సర్పంచ్‌తో పాటు గ్రామ పెద్దలు మాట్లాడుతూ తాగునీటి సమస్య పరిష్కారానికి చొరవ తీసుకుని మోటార్ల ఏర్పాటుకు సహకరించిన ఎమ్మెల్యేకు, పట్లోళ్ల బాల్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ ప్రజలకు అవసరమైన మౌలిక వసతుల కల్పనలో ఇదొక ముఖ్యమైన ముందడుగు అని పేర్కొన్నారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, గ్రామ పెద్దలు, స్థానిక నాయకులు, ప్రజలు పాల్గొన్నారు.

# బొజ్జా తారకం ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి

### బహుజన లెఫ్ట్ ఫ్రంట్ చైర్మన్ నల్ల సూర్యప్రకాశ్‌రావు



**ముషీరాబాద్, సెప్టెంబర్ 16 (జనం సాక్షి):** అగ్రకుల దోపిడీకి గురవుతున్న ప్రజల పక్షాన జీవితాంతం రాజీలేని పోరాటం చేసిన గొప్ప న్యాయవాది, ప్రజా ఉద్యమకారుడు బొజ్జా తారకం అని బహుజన లెఫ్ట్ ఫ్రంట్ చైర్మన్ నల్ల సూర్యప్రకాశ్‌రావు అన్నారు. దళితుల హక్కుల కోసం న్యాయపోరాటం చేస్తూనే వారిని సంఘటితం చేసిన గొప్ప మానవతావాది అని కొనియాడారు. విజయభారతి తన రచనల ద్వారా సమాజాన్ని చైతన్యవంతం చేశారని, ముఖ్యంగా యువతపై ఆమె రచనలు ప్రభావం చూపాయని అన్నారు. బొజ్జా తారకం, విజయభారతి ఆశయాలు, ఉద్యమ స్ఫూర్తిని యువత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఆర్‌పీఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ. రమేష్ ప్రారంభ ఉపన్యాసంలో బొజ్జా తారకం సామాజిక న్యాయం, దళితుల హక్కుల కోసం చేసిన పోరాటాన్ని వివరించారు. కార్యక్రమంలో ఆర్‌పీఐ నాయకులు ఎడ్ల ధనరాజ్, బట్టు గంగాధర్, అశోక్, భగవాన్, అజేంద్ర, శ్రీరాములు, పైడి తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో డీఈఓ ఆకస్మిక తనిఖీ

- ఎఫ్ఎల్ఎన్ నైపుణ్యాలపై ప్రత్యేక దృష్టి
- విద్యార్థులతో నేరుగా మాట్లాడి అభ్యసన స్థాయిపై ఆరా
- డిజిటల్ బోధన, కంప్యూటర్ గదుల పరిశీలన
- వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ: డీఈఓ



**హయత్‌నగర్, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన, విద్యార్థుల అభ్యసన సామర్థ్యాలను తెలుసుకునేందుకు జిల్లా విద్యాశాఖ అధికారి (డీఈఓ) వెంకటేశ్వర్లు హయత్‌నగర్ మండలంలోని పాఠశాలలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తరగతి గదుల్లో విద్యార్థులతో మాట్లాడి వివిధ సబ్జెక్టులపై ప్రశ్నలు అడిగి వారి అవగాహన స్థాయిని తెలుసుకున్నారు. నోట్ పుస్తకాలను పరిశీలించి బోధనా విధానంపై ఉపాధ్యాయులను అడిగి వివరాలు సేకరించారు. పాఠశాలల్లోని ఐపీ ప్యానెల్ బోర్డులు, కంప్యూటర్ గదులను పరిశీలించిన డీఈఓ డిజిటల్ సౌకర్యాలను విద్యార్థుల అభ్యసనానికి సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. ప్రాథమిక పాఠశాలల్లో ఫౌండేషనల్ లిటరసీ అండ్ న్యూమరసీ (ఎఫ్ఎల్ఎన్)లో భాగంగా విద్యార్థుల చదవడం, రాయడం, భాషా, గణిత నైపుణ్యాలను స్వయంగా పరిశీలించారు. ప్రతి విద్యార్థి అభ్యసన స్థాయిని గుర్తించి, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థుల్లో ఆసక్తి, భాగస్వామ్యం పెరిగేలా బోధన సాగించాలని, వారి విద్యా ప్రగతిని నిరంతరం సమీక్షించాలని తెలిపారు. పర్యటనలో ఎంఈఓ కే. శ్రీనివాసులు, ప్రధానోపాధ్యాయురాలు రమాదేవి, సీఆర్‌పీ రజని, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# 22ఏ భూముల సమస్యలు పరిష్కరించాలి

- నిషేధిత జాబితాలోని అర్హత ఉన్న భూములను సత్వరం తొలగించాలి
- మల్కాజిగిరి కలెక్టరేట్ ఎదుట టీడీపీ ధర్నా



**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, సెప్టెంబరు 16 (జనంసాక్షి) :** రిజిస్ట్రేషన్ల చట్టంలోని 22ఏ సెక్షన్ కింద నిషేధిత జాబితాలో చేర్చిన భూముల సమస్యలను సత్వరం పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో బుధవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. పార్టీ రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపు మేరకు చేపట్టిన ఈ కార్యక్రమంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు బక్కని నరసింహులు, అరవింద్‌కుమార్ గౌడ్, మల్కాజిగిరి పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు కందికంటి అశోక్‌గౌడ్ మాట్లాడుతూ.. రిజిస్ట్రేషన్ల చట్టంలోని 22ఏ సెక్షన్ కింద నిషేధిత జాబితాలో ఉన్న భూముల్లో అర్హత ఉన్న వాటిని గుర్తించి జాబితా నుంచి తొలగించే ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. 22ఏ నిషేధిత జాబితాలో భూములు ఉండటంతో వాటి రిజిస్ట్రేషన్, క్రయవిక్రయాల విషయంలో భూ యజమానులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. భూముల వివరాలను సమగ్రంగా పరిశీలించి, నిషేధానికి కారణం లేని భూములను 22ఏ జాబితా నుంచి తొలగించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం నాయకులు కలెక్టర్‌ను కలిసి సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు.

ఈ కార్యక్రమం లో తెలుగు మహిళా నాయకురాలు ఆశా బిందు, మేడ్చల్ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ సుంకర వెంకటేష్, మల్కాజ్గిరి పార్లమెంట్ అడాప్ కమిటీ సభ్యులు కరణం గోపి, చంద్రశేఖర్, జవహర్ నగర్ అధ్యక్షులు నామాల సురేష్, వెంకటరమణ దమ్మాయిగూడ అధ్యక్షులు కృష్ణారావు, నాగారం అధ్యక్షులు కొండ జంగారెడ్డి, కాప్రా సీనియర్ నాయకులు రాముల యాదవ్, చర్లపల్లి డివిజన్ కాంటెస్ట్ కార్పొరేటర్ రుద్రగోని రామచంద్ర గౌడ్, ఉమా శంకర్ గౌడ్, కోటేశ్వరరావు పాల్గొన్నారు



# 22ఏ పేరుతో సామాన్యులను వేధించొద్దు

శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 16 (జనంసాక్షి): 22ఏ నిబంధన పేరుతో పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలను ఇబ్బందులకు గురిచేయకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని తెలుగుదేశం పార్టీ డిమాండ్ చేసింది. ఈ మేరకు చేవెళ్ల పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ కట్టా వెంకటేష్ గౌడ్ ఆధ్వర్యంలో బుధవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ 22ఏ కమిటీ ప్రతినిధులు సమస్యను వెంటనే పరిష్కరించాలని కోరారు. కార్పొరేట్ సంస్థలు, భూస్వాములకు ప్రయోజనం చేకూరేలా కాకుండా సామాన్యులకు న్యాయం జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. 22ఏ విధానానికి తాము వ్యతిరేకం కాదని, అయితే దాని పేరుతో పేద కుటుంబాలు, రైతులు, దశాబ్దాలుగా నివసిస్తున్న కాలనీల ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తే సహించబోమని స్పష్టం చేశారు.

గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 22ఏ నిబంధన తొలగింపుతో భూకబ్జాలు, అక్రమాలకు అవకాశం కల్పించారని ఆయన ఆరోపించారు. అక్రమంగా ఆక్రమించిన భూములపై 22ఏ నిబంధనను ప్రయోగించి చర్యలు తీసుకుంటే టీడీపీ మద్దతు ఇస్తుందని తెలిపారు. రైతుల భూములు, పేదల కాలనీల జోలికి వస్తే ప్రజల తరఫున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# టెట్ విధానంపై సబ్‌కమిటీ ఏర్పాటు

ఎన్‌సీటీఈ అధికారులను కలిసి వినతిపత్రం సమర్పించింది.

సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో దేశవ్యాప్తంగా సర్వీసులో ఉన్న ఉపాధ్యాయులు 2028 ఆగస్టు 31లోగా టెట్ ఉత్తీర్ణత సాధించాల్సి ఉండటంతో ఆందోళన చెందుతున్నారని ప్రతినిధులు తెలిపారు. టెట్ సిలబస్‌ను శాస్త్రీయంగా రూపొందించాలని, సబ్జెక్టుల వారీగా పరీక్షలు నిర్వహించాలని, అర్హత మార్కులను తగ్గించాలని కోరారు. సమస్యలకు త్వరలో సానుకూల పరిష్కారం చూపుతామని ఎన్‌సీటీఈ అధికారులు హామీ ఇచ్చినట్లు ఎస్‌టీఎఫ్ఐ నాయకులు వెల్లడించారు.

అనంతరం కేంద్ర ఎన్నికల సంఘం కార్యాలయాన్ని సందర్శించిన ఎస్‌టీఎఫ్ఐ ప్రతినిధులు, ఉపాధ్యాయ, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో అర్హులైన వారినే ఓటర్లుగా నమోదు చేయాలని కోరారు. ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు కూడా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటుహక్కు కల్పించాలని వినతిపత్రం సమర్పించారు.

# కెసిఆర్ పాలనలోనే గిరిజనులకు స్వర్ణయుగం

**నేడు ప్రతి గిరిజన తండాలో కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేయాలి**

**తలకొండపల్లి మండల బిఆర్ఎస్ ఎస్టీ సెల్ నాయకులు కోర్ర కృష్ణ నాయక్ పిలుపు**




**తలకొండపల్లి సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** తెలంగాణ రాష్ట్రంలో కెసిఆర్ పాలనలోనే గిరిజనులకు స్వర్ణయుగం నడిచిందని తలకొండపల్లి మండల బిఆర్ఎస్ ఎస్టీ సెల్ నాయకులు కోర్ర కృష్ణ నాయక్ అన్నారు. బుధవారం తలకొండపల్లి మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. గతంలో తండాలు గ్రామపంచాయతీలలో కలిసి ఉండేవని, కెసిఆర్ ముఖ్యమంత్రి అయ్యాక ప్రతి తండాను ప్రత్యేక గ్రామపంచాయతీగా ఏర్పాటు చేసి గిరిజనులకు స్వయం పాలన కల్పించారని తెలిపారు. గిరిజన బిడ్డల చదువు కోసం గురుకుల పాఠశాలలు, డిగ్రీ కళాశాలలు ఏర్పాటు చేశారని, గిరిజన రైతులకు రైతుబంధు, రైతుబీమా, ఉచిత కరెంటు వంటి పథకాలు అందించారని పేర్కొన్నారు. గిరిజనులకు 6శాతం ఉన్న రిజర్వేషన్లను 10శాతానికి పెంచి గిరిజనుల జీవితాల్లో వెలుగు నింపారని కొనియాడారు. గిరిజనుల పోడు భూములకు పట్టాలు ఇచ్చిన ఘనత కెసిఆర్ కే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక గిరిజనులను పట్టించుకోవడం లేదని, సంక్షేమ పథకాలు నిలిపివేశారని విమర్శించారు. కెసిఆర్ చేసిన సేవలను గిరిజన సమాజం ఎప్పటికీ మర్చిపోదని, నేడు ప్రతి తండాలో కెసిఆర్ చిత్రపటానికి పాలాభిషేకం చేసి ఆయన సేవలను కొనియాడాలని పిలుపునిచ్చారు.

## కోరింతకుంట తండాలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

తలకొండపల్లి సెప్టెంబర్ 16 (జనంసాక్షి): మండలంలోని కోరింతకుంట తండా గ్రామపంచాయతీలో ఈరోజు నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ పరిధిలో అర్హులైన లబ్ధిదారులకు నూతన స్మార్ట్ రేషన్ కార్డులను సర్పంచ్ చేతుల మీదుగా పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన స్మార్ట్ కార్డుల వల్ల పారదర్శకంగా రేషన్ బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు అందుతాయని సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మూడావత్ సరోజ రవీందర్, ఉప సర్పంచ్ నరసింహ, మాజీ ఉప సర్పంచ్ రవి, గ్రామ కార్యదర్శి శివప్రసాద్, వార్డు మెంబర్లు బీమా, బాలు, స్వాతి, శక్రు నాయక్, వినోద్ కుమార్, శోభ, వసంత, చిన్ని, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి



**అల్వాల్, సెప్టెంబరు 16 (జనంసాక్షి):** రాంనగర్‌లో తరచూ చోటుచేసుకుంటున్న మురుగునీటి పొంగిపొర్లే సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మాజీ కార్పొరేటర్ శాంతి శ్రీనివాస్‌రెడ్డి అధికారులను కోరారు. బుధవారం హెచ్ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ డీజీఎం వెంకటేశ్, మేనేజర్ రమేశ్, జార్జ్, అరుణ్, ప్రశాంత్, మహేశ్, రామకృష్ణ, మనీష్‌లతో కలిసి ఆమె సమస్యాత్మక ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా మురుగునీరు తరచూ పొంగిపొర్లడంతో స్థానికులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. తాత్కాలిక చర్యలతో సమస్య పునరావృతం కాకుండా కారణాలను గుర్తించి శాశ్వత పరిష్కారం కల్పించాలని కోరారు.

# హిందీ నేర్చుకుంటే అవకాశాలకు కొత్త దారులు

- ప్రధానోపాధ్యాయులు పి.సి.రాములు
- నాగారం ప్రభుత్వ పాఠశాలలో ఘనంగా హిందీ దినోత్సవ వేడుకలు




**కీసర, సెప్టెంబర్ 16 (జనంసాక్షి) :** హిందీ భాషపై పట్టు సాధించడం ద్వారా విద్యార్థులకు ఉన్నత విద్య, ఉపాధి రంగాల్లో మరిన్ని అవకాశాలు లభిస్తాయని నాగారం ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి.సి.రాములు అన్నారు. నాగారం డివిజన్ పరిధిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో హిందీ దినోత్సవ వేడుకలను ప్రధానోపాధ్యాయులు పి.సి.రాములు అధ్యక్ష తన ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా ప్రజలను అనుసంధానించే భాషగా హిందీకి ప్రత్యేక స్థానం ఉందన్నారు. విద్యార్థులు మాతృభాషతో పాటు హిందీ భాషను కూడా అభ్యసించడం ద్వారా తమ వ్యక్తిత్వ వికాసాన్ని పెంపొందించుకోవచ్చని సూచించారు. హిందీ భాషా బోధకులు సంజయ్ రాణీ, అల్కా ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. హిందీ భాష ప్రాధాన్యంపై ఉపన్యాసాలు, డ్రాయింగ్, వ్యాసరచన పోటీలు నిర్వహించగా విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి ప్రతిభ కనబరిచిన విద్యార్థులను ప్రోత్సహించారు. వివిధ పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఉపాధ్యాయులు రాజ్యలక్ష్మి, శ్రీదేవి, సుమతి, మాలోత్ నాయక్, వందన, వరమ్మ, అజీజ్ అహ్మద్, రమా, సత్యశ్రీ, సరిత, గాయత్రీ, పద్మ, అర్చన, కౌసల్య, కమల, పాండురంగారెడ్డి, రఘు, సుప్రజ, విద్యా వాలంటీర్లు స్వప్న, పావని, పవిత్ర, విశాలి, దివ్య, కార్యాలయ సిబ్బంది సౌజన్య, ఇందిరా, లక్ష్మి పాల్గొన్నారు.

# విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలి

**-జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ మెతుకు ఆనంద్**



**ధారూర్,సెప్టెంబర్ 16 (జనంసాక్షి) :** విఘ్నేశ్వరుని ఆశీస్సులతో ప్రజలంతా సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ ఆకాంక్షించారు.వినాయక చవితి ఉత్సవాల్లో భాగంగా బుధవారం ధారూర్ మండల కేంద్రంలోని వివిధ గణేష్ మండపాలను ఆయన సందర్శించారు.ఈ సందర్భంగా ఆయా గణేష్ మండపాల వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని గణనాథునికి భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు.గణపతిని దర్శించుకుని స్వామి వారి ఆశీస్సులు పొందారు. అనంతరం గణేష్ ఉత్సవ నిర్వాహకులు, భక్తులతో కలిసి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.ప్రజలందరికీ ఆరోగ్యం,ఆనందం,శాంతి, సుఖసంతోషాలు కలగాలని,విఘ్నేశ్వరుడు ప్రతి ఒక్కరి జీవితంలోని విఘ్నాలను తొలగించి సుఖశాంతులను ప్రసాదించాలని ఈ సందర్భంగా ప్రార్థించినట్లు తెలిపారు.వినాయక ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో, ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఆయన ఆకాంక్షించారు.గణనాథుని కృపతో ప్రజల జీవితాల్లో సుఖసంతోషాలు వెల్లివిరియాలని కోరారు.ఈ కార్యక్రమంలో ధారూర్ గ్రామ సర్పంచ్ ప్రమీల చిన్నగౌడ్, ఉపసర్పంచ్ జాంగిర్,మండల సీనియర్ నాయకులు వేణుగోపాల్ రెడ్డి,మండల పార్టీ అధ్యక్షుడు పట్లాల శ్రీకాంత్ రెడ్డి,పార్టీ సీనియర్ నాయకులు పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించాలి

- సెప్టెంబర్ 17 చరిత్రను భావితరాలకు తెలియజేయాలి
- డిప్యూటీ తహశీల్దార్‌కు బీజేపీ నేతల వినతి
- విమోచన యోధుల త్యాగాలను స్మరించాలి
- విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి



**జవహర్‌నగర్, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** తెలంగాణ విమోచన దినోత్సవమైన సెప్టెంబర్ 17ను రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేస్తూ జవహర్‌నగర్ డివిజన్ బీజేపీ ఆధ్వర్యంలో బుధవారం కాప్ర మండల తహశీల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తహశీల్దార్ జి. ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. డివిజన్ అధ్యక్షుడు కలికోట కమలాకర్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా కమలాకర్ మాట్లాడుతూ 1948 సెప్టెంబర్ 17 తెలంగాణ చరిత్రలో కీలకమైన రోజని అన్నారు. నిజాం పాలన నుంచి తెలంగాణ విముక్తి కోసం జరిగిన పోరాటం, యోధుల త్యాగాలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. సెప్టెంబర్ 17ను కేవలం ఒక కార్యక్రమానికే పరిమితం చేయకుండా రాష్ట్రవ్యాప్తంగా అధికారికంగా నిర్వహించాలని కోరారు. ప్రభుత్వ కార్యాలయాలు, విద్యాసంస్థలు, జిల్లా, మండల కేంద్రాల్లో అధికారిక కార్యక్రమాలు నిర్వహించడంతో పాటు పాఠశాలలు, కళాశాలల్లో సదస్సులు, చర్చలు, వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించాలని బీజేపీ నేతలు సూచించారు. విమోచన పోరాట యోధులు, అమరవీరుల త్యాగాలను ప్రజలకు తెలియజేసే కార్యక్రమాలు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు మరాఠి బాబు, బిక్షపతి గౌడ్, లిఖిత యాదవ్, పుల్లూరి అనిల్, బొమ్మ యాదగిరి, ఒరుగంటి లత, రాఘవేంద్రచారి తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట స్ఫూర్తితో హక్కుల కోసం పోరాడాలి




**హయత్ నగర్, సెప్టెంబర్ 16 (జనం సాక్షి) :** తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట వారోత్సవాలను పురస్కరించుకుని విశ్రాంత ఉద్యోగుల సంఘం రంగారెడ్డి జిల్లా ఆధ్వర్యంలో బుధవారం వనస్థలిపురంలోని జనప్రియనగర్ సీనియర్ సిటిజన్ భవన్‌లో సాయుధ పోరాట స్ఫూర్తి సభ నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్లు, పెన్షనర్లు, అభ్యుదయనగర్, ప్రశాంత్‌నగర్ ప్రాంతాల నాయకులు తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటం చారిత్రక నేపథ్యం, ప్రాధాన్యతను వివరించారు. అడ్వకేట్ కట్ట భగవంత రెడ్డి మాట్లాడుతూ, నిజాం సంస్థానంపై సైనిక చర్య పేరుతో యూనియన్ సైన్యం కమ్యూనిస్టులపై తీవ్ర నిర్బంధ చర్యలకు పాల్పడిందని ఆరోపించారు. భూములు వదిలి వెళ్లిన భూస్వాములకు అండగా నిలిచిందని, ఇది ప్రజా ఉద్యమానికి ద్రోహం చేయడమేనని అన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో అమరులైన వారికి నివాళులర్పించారు.

కామ్రేడ్ యాదయ్య మాట్లాడుతూ, రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం ప్రాంతంలో కాచం కృష్ణమూర్తి, అడివయ్యల నాయకత్వంలో అనేక భూ పోరాటాలు జరిగాయని, పేదలకు భూములు పంపిణీ చేసిన చరిత్ర ఉందని గుర్తుచేశారు. అదే స్ఫూర్తితో నేటి రియల్ ఎస్టేట్ మాఫియాలను కట్టడి చేయాలని అన్నారు. దోకూరి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ, పలివెల ప్రాంతంలో జుగాల్ రెడ్డి, గుర్నాథ్ రెడ్డి సాగించిన వీరోచిత పోరాటాలను గుర్తుచేశారు. అన్యాయాలు, అక్రమాలకు వ్యతిరేకంగా చిత్తశుద్ధితో పోరాటాలు సాగించాలని కోరారు. పాలకుర్తి కృష్ణమూర్తి మాట్లాడుతూ, ఆనాటి పోరాట స్ఫూర్తితో కార్మికులు, కర్షకులు, ఉద్యోగులు, పెన్షనర్లు తమ న్యాయబద్ధమైన హక్కుల సాధన కోసం ఉద్యమాలను కొనసాగించాలని పిలుపునిచ్చారు.

రంగారెడ్డి జిల్లా టాప్రా ఉపాధ్యక్షురాలు అనసూయ మాట్లాడుతూ, తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో మహిళల పాత్ర ఎంతో గణనీయమైనదని అన్నారు. చిట్యాల ఐలమ్మ, మల్లు స్వరాజ్యం, ఆరుట్ల కమలాదేవి, సుగుణమ్మ, సరోజమ్మ, లక్ష్మమ్మ తదితర మహిళా యోధుల త్యాగాలను స్మరించుకున్నారు. ఆనాటి మహిళల పోరాట స్ఫూర్తితో నేటి మహిళలు తమ సామాజిక, రాజకీయ హక్కుల కోసం ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కృష్ణారావు, సుదర్శన్ రెడ్డి, బ్రహ్మచారి, బీజేఎం రెడ్డి, భాస్కర్ రాజు, రంగయ్య చౌదరి, రాజేందర్ రెడ్డి, డాక్టర్ కేశవరావు, పల్లా గోవర్ధన్, రవీందర్ రెడ్డి, నాగయ్య, విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శిగా సుభాష్ నాయక్

**సుభాష్ నాయక్ కు నియామక పత్రం అందించిన డీసీసీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్**

**బోడుప్పల్-జనంసాక్షి :** మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని మేడిపల్లి డివిజన్ కాంగ్రెస్ పార్టీ జనరల్ సెక్రటరీగా సుభాష్ నాయక్ నియమించబడ్డారు. ఈ మేరకు మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్ సుభాష్ నాయక్ కు నియామక పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా సుభాష్ నాయక్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతలను శక్తివంతం లేకుండా నిర్వర్తిస్తానని తెలుపుతూ పార్టీ అధిష్టానానికి, మేడ్చల్ జిల్లా బి బ్లాక్ అధ్యక్షుడు వేముల మహేష్ గౌడ్, పీర్జాదిగూడ మాజీ మేయర్ అమర్ సింగ్, మాజీ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, మేడిపల్లి డివిజన్ అధ్యక్షుడు తుంగతుర్తి రవి,పార్టీ నాయకులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ద

పార్టీ అభివృద్ధికి, ప్రజా ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు నిరంతరం కృషి చేస్తానని సుభాష్ నాయక్ అన్నారు.



# అదనంగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటు చేయాలని ఎమ్మార్వోకు వినతి

**తలకొండపల్లి,సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని వెల్జాల్ గ్రామంలో అదనంగా మరో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ గ్రామ సర్పంచ్ వానరాశి రాములమ్మ ఎమ్మార్వోకు బుధవారం వినతిపత్రం అందజేశారు.వెల్జాల్ గ్రామపంచాయతీ పరిధిలోని చెన్నంపల్లి,ఇస్రాయిపల్లి గ్రామాలకు చెందిన ఓటర్లు వెంకటాపూర్ లోని 44వ పోలింగ్ కేంద్రంలో ఉన్నారని,అలాగే వెల్జాల్ పంచాయతీకి చెందిన మరికొందరు ఓటర్లు మదాయిపల్లి 47వ పోలింగ్ కేంద్రంలో ఉన్నారని,దీంతో ఓటర్లు ఇబ్బందులు పడుతున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు.వేరే గ్రామపంచాయతీల పరిధిలో ఉన్న వెల్జాల్ ఓటర్లందరినీ ఒకేచోటకు తీసుకువచ్చి వెల్జాల్ గ్రామంలో కొత్తగా ఇంకో పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరారు.ఈ మేరకు ఎమ్మార్వో కే.రమేష్ కుమార్,ఆర్ఐ శ్రవణ్ లకు వినతిపత్రం అందజేశారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ వానరాశి రాములమ్మ,ఉప సర్పంచ్ శివ విజయలక్ష్మివిజయ్ కుమార్,గ్రామ నాయకులు ఎం.ఏ. అజీజ్,సి.హెచ్. విష్ణువర్ధన్ యాదవ్,వానరాశి వెంకటేష్, సుభాన్, వి.శేఖర్, మస్కు వెంకటయ్య, పి.సుల్తాన్, ఎల్ రమేష్, వి.బాలరాజ్, బి.జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

# టీఆర్ఎస్ పార్టీ యంబిసి రాష్ట్ర అధ్యక్షులుగా కుమ్మరి శివ శంకర్ నియామకం



**మొయినాబాద్ జనం సాక్షి :** తెలంగాణ రక్షణ సేన పార్టీలో మంచి స్థానం ఉంటుందని పార్టీని అధికారంలోకి వచ్చే దిశగా ప్రతి ఒక్కరూ కష్టపడి పని చేయాలని తెలంగాణ రక్షణ సేన టీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు కవితమ్మ ఉన్నారు బుధవారం నాడు తెలంగాణ రక్షణ సేన కేంద్ర కార్యాలయంలో తెలంగాణ ఉద్యమకారుడు మొయినాబాద్ మున్సిపాలిటీ చిలుకూరు గ్రామానికి చెందిన కుమ్మరి శివశంకర్ ను ఎంబీసీ రాష్ట్ర అధ్యక్షులుగా నియమించడం జరిగింది ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుడు కుమ్మరి శివ శంకర్ మాట్లాడుతూ కల్వకుంట్ల కవితమ్మ తీసుకున్న ప్రతి విషయంలో వారి నాయకత్వంలో ఎప్పటికీ పనిచేయడానికి సిద్ధంగా ఉన్నామని వారిని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి చేసే వరకు తెలంగాణ రక్షణ సేన ప్రతి విభాగం పని చేస్తుందని వారు అన్నారు నా పైన నమ్మకంతో రాష్ట్ర అధ్యక్షులుగా నియమించిన కల్వకుంట్ల కవిత నాకు సహకరించిన టీఆర్ఎస్ నాయకులకు కృతజ్ఞతలు తెలియజేశారు.

# విమోచన దినోత్సవానికి అధికారిక గుర్తింపు ఇవ్వాలి



**అల్వాల్, సెప్టెంబర్ 16 (జనంసాక్షి):** సెప్టెంబర్ 17ను తెలంగాణ విమోచన దినోత్సవంగా అధికారికంగా గుర్తించి నిర్వహించాలని కోరుతూ బీజేపీ నాయకులు బుధవారం ఎంఆర్ఓ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. హైదరాబాద్ సంస్థానం భారత యూనియన్‌లో విలీనమైన చారిత్రక సందర్భాన్ని స్మరించుకోవడంతోపాటు, నాటి పోరాటాల్లో పాల్గొన్న వారి త్యాగాలను గుర్తించాలని వారు కోరారు. విమోచన దినోత్సవాన్ని అధికారికంగా నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని వినతిపత్రంలో పేర్కొన్నారు.ద

# కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం.

**నేడు నియోజకవర్గంలోని గ్రామాల్లో పర్యటించనున్న పైలెట్ రోహిత్ రెడ్డి.**

తాండూరు సెప్టెంబర్ 16(జనంసాక్షి)బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమం నేపథ్యంలో తాండూర్ మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో పర్యటించనున్నారు.ఈ మేరకు తాండూర్ బీఆర్ఎస్ క్యాంప్ కార్యాలయం నుంచి పర్యటన షెడ్యూల్ విడుదల చేశారు. బీఆర్ఎస్ క్యాంప్ కార్యాలయ ఇంచార్జ్ మాట్లాడుతూ కేసీఆర్ చిత్రపటానికి పాలాభిషేకం కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి పైలెట్ రోహిత్ రెడ్డి గ్రామాల్లో విస్తృతంగా పర్యటిస్తున్నారని తెలిపారు.యాలాల మండలం ఉదయం 9:00 గంటలకు సంగాయిపల్లి తండాలో బషీరాబాద్ మండలం -ఉదయం 10:00 గంటలకు పర్షానాయక్ తండా, తుర్నాయక్ తండాలో పెద్దేముల్ మండలం ఉదయం 11:00 గంటలకు కందనెల్లి తండాలో తాండూర్ మండలం మధ్యాహ్నం 12:00 గంటలకు సంకిరెడ్డిపల్లి తండాలో ఈ కార్యక్రమంలో అన్ని మండలాల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, ముఖ్య నాయకులు, సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ సంస్థల నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరుతున్నట్లు క్యాంప్ కార్యాలయం విజ్ఞప్తి చేశారు.